క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన సిటీ బస్సు సర్వీస్‌లో ప్రయాణికులకు లక్కీ డ్రా స్కీం ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం పి.శివాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూట్ నంబర్ 252 (కా.మార్కెట్-హనుమాన్‌జంక్షన్ వయా ఏలూరు రోడ్డు), రూట్ నంబర్ 252బీ (కా.మార్కెట్- హనుమాన్‌జంక్షన్ వయా బందర్ రోడ్డు)లో ప్రయాణించే వారికి ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ప్రయాణికులు తమ టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి డ్రా తీసి ఒక్కొక్క రూట్‌లో ఎంపికైన ఇరువురు చొప్పున ప్రయాణికులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రిటైర్డు హెచ్‌ఎం సాంబిరెడ్డి మృతి



నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన చాగంటి సాంబిరెడ్డి (94) సోమవారం నున్న గ్రామంలో ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడు నెలల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతూ మృతి చెందారు. సాంబిరెడ్డి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

అబు కలాంకు సత్కారం



ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ నూతన అధ్యక్షుడుగా నియమితులైన ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అబు కలాంను ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సత్కరించి, అభినందనలు తెలిపారు. స్థానిక పట్టణ పార్టీ కార్యాలయంలో సోమవారం అబు కలాం ను మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. తనను ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడుగా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారధికి అబు కలాం కృతజ్ఞతలు తెలిపారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తి పై కేసు

పెనమలూరు: వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన వివాహిత షేక్. మస్తాన్‌బి గత పది రోజుల క్రితం సనత్‌నగర్‌కు వచ్చి కుటుంబ సభ్యులతో ఉంటుంది. అయితే ఆమె గతంలో గోసాల వైకుంఠపురంలో ఉన్న సమయంలో తాపీమేస్త్రీగా పని చేస్తున్న అబ్దుల్లా ఆమె వెంటపడేవాడు. మస్తాన్‌బి సనత్‌నగర్‌కు వచ్చిన తరువాత కూడా ఆమె ఇంటి వద్దకు వచ్చి ఆమెను వేధిస్తూ ఫోన్‌లు చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

భర్త, అత్తమామలపై కేసు నమోదు

పెనమలూరు: ప్రేమించి పెళ్లి చేసుకుని ముఖం చాటేసిన భర్త, అత్తింటివారిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పెనమలూరు గ్రామం శ్రీహరి గార్డెన్స్‌కు చెందిన సంకెళ్ల కల్యాణికి గతంలో వివాహం అయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారటంతో భర్తను వదిలేసి పుట్టింట్లోనే ఉంటూ ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తుంది. అయితే సంకెళ్ల శ్రీహరి అనే వ్యక్తి ఆమెను ప్రేమించానని పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి చేశాడు. మే 13వ తేదీన పెద్దల సమక్షంలో శ్రీహరి, కల్యాణి వివాహం చేసుకున్నారు. కల్యాణి పుట్టింట్లోనే కాపురం పెట్టారు. అయితే ఆగస్టు 15వ తేదీన భర్త విజయవాడలో ఉన్న తల్లి సుజాత వద్దకు వెళ్లి తిరిగి మరల రాలేదు. దీంతో కల్యాణి విజయవాడ అత్తంటికి వెళ్లి భర్తను కాపురానికి పంపాలని కోరింది. కట్నం తీసుకొస్తేనే శ్రీహరి కాపురానికి వస్తాడని దుర్భాషలాడారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రమయించి భర్త శ్రీహరి, అత్త సుజాత, మామ కనకదుర్గప్రసాద్, ఆడపడుచు లక్ష్మిదుర్గ బెదిరిస్తుండటంతో బాధితురాలు వీరి పై ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటివారి పై కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక గ్రామానికి చెందిన బందారు పద్మ విజయవాడ వన్ టౌన్‌కు చెందిన రంగారావును 2008 సంవత్సరంలో కట్నకానుకలు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని, అదనపు కట్నం తీసుకురమ్మని భర్త రంగారావు, అత్త పైడమ్మ, ఆడపడుచు రమణ, ఆమె భర్త నారాయణరావు వేధించ సాగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మహాత్ముడికి ఘన నివాళి



ఎమ్మెల్యే ఆఫీస్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



యనమలకుదురులో పండ్లు పంపిణీ చేస్తున్న నరేష్‌కుమార్



యనమలకుదురు శేషమాంబ ఆశ్రమం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు



నున్న గ్రామపంచాయతీలో గాంధీ జయంతి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ అనగాని, ఎంపీడీఓ



ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



గాంధీపార్కులో మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



జంక్షన్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ దుట్టా, జెడ్పీటీసీ గంగాభవాని



ప్రసాదంపాడులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు



పెరికీడులో గాంధీ, నేతాజీ విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు



ఉంగుటూరులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సరోజిని, ఎంపీడీవో



పురుషోత్తపట్నం లైబ్రరీ వద్ద గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృపానందం

పెనమలూరు: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో మహాత్మాగాంధీ ఫొటోకు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటశివయ్య మాట్లాడుతూ అహింసా మార్గంతోనే దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీ ఆశయాలను అనుగుణంగా మెలగాలని సూచించారు. యనమలకుదురులో మహాత్మగాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత, రాష్ట్ర బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పెనమలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ లింగాల భాస్కరరావు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు సభ్యుడు వీరంకి రాఘవులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. యనమలకుదురు శేషమాంబ ఆశ్రయం వద్ద గాంధీ జయంతి ఘనంగా చేశారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్.కాశిం , వాటపల్లి శ్రీరాములు, పాస్టర్ బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు. కానూరు అశోక్ జిమ్‌లో బాడీ బిల్డింగ్ క్రీడాకారులు గాంధీ జయంతి ఘనంగా చేశారు. జిల్లా బాడీ బిల్డింగ్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి అశోక్,పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో జయంతి వేడుకలు జరిగాయి. స్టేషన్ ఇన్‌చార్జి కేఎస్‌రావు, సీనియర్ జనరల్ మేనేజర్, సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి వి.రమేష్‌బాబు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు జీకేడీ వరప్రసాదరావు పాల్గొన్నారు. పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధి జయంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పి.నైనవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచి బట్టా సోమయ్య ఆధ్వర్యంలో గాంధి జయంతి వేడుకలు జరిగాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గాంధి జయంతి వేడుకల్లో గ్రామ సర్పంచ్ సీతయ్య పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్ కైలే శివకుమార్, పార్టీ నేతలు పడమట సురేష్, పాలిమెట్ల జయరాజు, కొల్లి రాజశేఖర్, జలసూత్రం రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద ఎంపీపీ అనగాని రవి, ఎంపీడీఓ సత్యకుమార్ పుష్పాంజలి ఘటించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరందామయ్య, ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని లక్ష్మీనరసింహారావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ కరిముల్లా, పలువురు అధికారులు పాల్గొన్నారు. గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వసతి గృహ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

ఉయ్యూరు: జాతిపిత బాపూజీ చూపిన బాటలో నడుచుకోవాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి సోమవారం నిర్వహించారు. కార్యాలయం ఆవరణ వెలుపల మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు కూరాడ వెంకటలక్ష్మి, నూర్జహాన్, గుంజా సుధాకర్‌బాబు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పార్టీ నాయకులు అబ్దుల్ సద్దాం, కొక్కిలిగడ్డ ప్రదీప్, ఎంజె రవి, పినమాల నాగకుమార్, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతిలో అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యాలయంలో ఆర్‌డీఓ ఎస్.విజయ్‌కుమార్ మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, గ్రామ సచివాలయాల్లో బాపూజీ జయంతి నిర్వహించారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలి

కంకిపాడు: మహాత్ముడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని వక్తలు సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, వార్డు సభ్యుడు వంకదారు చిట్టబ్బాయ్, ఈడ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా నేతలు బండి నాంచారయ్య, బాకీ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కంకిపాడు గాంధీపార్కులో గాంధీ జయంతి నిర్వహించారు. నేతలు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్ బాకీ రమణ, సీహెచ్‌సీ చైర్మన్ ఎం.కుటుంబరావు, పార్టీ నేతలు జొన్నలగడ్డ నాగేశ్వరరావు, షేక్ చిన్నా, వెంకటరెడ్డి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో సోమవారం గాంధీ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రామసభల్లో స్వచ్ఛతే హి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రసాదంపాడులో జెడ్పీటీసీ సువర్ణరాజు, పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. నిడమానూరులో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: శాంతియుత మార్గంలో దేశానికి స్వాతంత్య్రాన్ని సాధించిన మహనీయుడు గాంధీ అని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. గాంధీజీ జయంతి వేడుకలను హనుమాన్‌జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతామహాలక్ష్మీ నర్సింగ్ హోం ప్రాంగణంలో జరిగిన జయంతి వేడుకల్లో గాంధీ చిత్రపటానికి డాక్టర్ దుట్టాతో పాటుగా జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ నాయకులు కొడాలి సత్యప్రభాకరరావు, ఉసా జయప్రసాద్, చిన్నాల లక్ష్మీనారాయణ, బొడ్డు జగన్, తూము రాధాకృష్ణామూర్తి, ఆళ్ల గోపాలకృష్ణ, కడవకొల్లు రాజేష్, తాడిశెట్టి శ్రీను, అన్నం సత్యనారాయణ, తమ్మాలాల రంగారావు, సముద్రాల రాజాబాబు, కూరపాటి రాధాకృష్ణ, ముత్యాల సుదర్శనరావు పాల్గొన్నారు. స్థానిక హనుమాన్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద స్థానికులు జయంతి ఘనంగా నిర్వహించారు. పెరికీడు వంతెన వద్ద గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు వైస్ ఎంపీపీ పండు రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, పార్టీ నాయకులు నక్కా బాబు, మెరుగుమాల వేణు పాల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నిర్వహించారు.

ఉంగుటూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొని గాంధీజి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీవో శేషగిరిరావు, సర్పంచ్ కాటూరి వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి గ్రామస్తులు, పాఠకులు నివాళులర్పించారు. సచివాలయం కార్యదర్శి ఈశ్వర్, ఉపసర్పంచ్ కుంటముక్కల శివయ్య, కొడాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గోపవరపుగూడెం గ్రామంలో సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు స్థానిక సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదలవారిగూడెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బుద్ధాల లక్ష్మి ప్రసన్న, సచివాలయం కార్యదర్శి కేవీ రాజశేఖర్, సిబ్బంది గాంధీ జయంతి నిర్వహించారు.

కందలపాడులో స్వచ్ఛతా హి సేవ



కంకిపాడు: మండలంలోని కందలంపాడు గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు మానికొండ గ్రామానికి చెందిన పలువురు కందలంపాడు గ్రామంలోని పరిసరాలను శుభ్రం చేశారు. వీధులు వెంబడి, ప్రధాన కూడళ్లు, సామాజిక స్థలాల్లో మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. శ్రమదాన కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు పర్యవేక్షించారు. పరిశుభ్రత ఒక్క రోజుకు పరిమితం కాకూడదన్నారు. ప్రతి రోజూ ఇంటి పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచుకుంటే గ్రామాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



పెనమలూరు: మండలంలో రెండవ రోజూ లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. మండల పరిధిలో ఉన్న 18,608 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5.18 కోట్ల నిధులు పింఛన్‌కు విడుదల చేసింది. మొదటి రోజు 70 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. రెండవ రోజు సోమవారం కూడా వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. పెనమలూరు సచివాలయం 1లో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న యంగమ్మకు రూ.10 వేల పింఛన్ వలంటీర్ బాణావత్ మాధవి అందజేసింది.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



కూచిపూడి(మొవ్వ): మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా కూచిపూడిలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత కేపీ రెడ్డియ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అందించిన ఫ్రీజర్ బాక్స్‌ని సోమవారం ఆ ట్రస్ట్ సభ్యులు ప్రారంభించారు. కేపీ రెడ్డియ్య కుమారులు పెనమలూరు శాసనసభ్యుడు కొలుసు పార్థసారధి, డాక్టర్ కేవీపీ సుబ్బారావు, కె.కృష్ణకాంత్‌లు రూ.95 వేల విలువల చేసే ఫ్రీజర్ బాక్స్‌ను ట్రస్టుకు అందచేశారు. అలాగే కూచిపూడిలోని సత్యసాయి కాంప్లెక్స్‌లో 21మంది పేద వృద్ధులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లను అందచేశారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పిట్టు శ్రీనివాసరావు, కార్యదర్శి పాగోలు రమేష్ బాబు, కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, గౌరుపర్తి రమణ, డాక్టర్ పి.అశోక్, కంచర్ల మంత్రయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనాలు

కంకిపాడు: గణేష్ నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణేష్ నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రమైన కంకిపాడు, ప్రొద్దుటూరు గ్రామాల్లోని కూడళ్లలో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు పూజలు నిర్వహించి ప్రత్యేకంగా సిద్ధం చేసిన వాహనాల్లో సోమవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు రహదారులపై పసుపునీరు ఒరబోసి, స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ కె.సుధాకర్ పర్యవేక్షించారు.

271 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

కంకిపాడు: పట్టణంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పోరంకికి చెందిన అమృత హెల్త్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరంలో 271 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కృపాలిన్, సిబ్బంది వైద్య సేవలు అందించారు. మందులను సోషల్ వర్కర్ రాము అందించారు. శిబిరాన్ని ఆక్యుపంక్చర్ వైద్యులు సత్యనారాయణ, భగవాన్, వీరకుమారి పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

గన్నవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి, గన్నవరం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 106 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రోటరీక్లబ్ ద్వారా దుస్తులను సర్పంచులు చేబ్రోలు లక్ష్మీమౌనిక, నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా అందజేశారు. జాస్తి మాట్లాడుతూ కోవిడ్ విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య విధులు నిర్వర్తించిన తీరు మరువలేవమన్నారు. ఈ సేవలకు గుర్తుగా తమవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రోటరీ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, గన్నె వెంకట్రావు, నెక్కలపూడి ఈశ్వరరావు, గొట్టం రవిబాబు, ఈటలు మౌనిక, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

మాదిగల విశ్వరూపం మహాసభను జయప్రదం చేయాలి



సమావేశంలో ఎమ్మార్పీస్ నాయకులు

నున్న(విజయవాడరూరల్): ఎస్సీ వర్గీకరణ బిల్లును శీతాకాలంలో జరగబోయే చివరి పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరుతూ నవంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని గన్నవరం నియోజకవర్గం మహాజన సోషలిస్టు పార్టీ ఇంచార్జ్ మంద వేణుబాబు అన్నారు. సోమవారం నున్న గ్రామంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ రూరల్ మండల నాయకులు చిల్లిముంత కోటేశ్వరావుమాదిగ, తగరం విజయ్‌కుమార్ మాదిగ, ప్రత్తిపాటి దావీదు మాదిగ, తగరం శిఖామణి, తగరం రమేష్, ప్రత్తిపాటి జాన్‌రవి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై బైండోవర్ కేసు

పెనమలూరు: రౌడీషీటర్ పై పోలీసులు సోమవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. చోడవరం గ్రామానికి చెందిన గవిరినేని అనిల్‌కుమార్‌పై పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటు ఉంది. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు.

కష్టపడితే ఉన్నత శిఖరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ

ఉయ్యూరు: లక్ష్య నిర్దేశంతో కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. పట్టణంలోని ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరంలో హెబ్రోను యూత్ రిట్రీట్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌వెస్లీ ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనాగీతాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రార్థనా గీతాలు ఆలపించే వారిలో ప్రతిభను వెలికితీయటమే యూత్ రిట్రీట్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జీవితంలో గెలుపోటములు సహజమన్నారు. లక్ష్యం లేకుండా జీవితంలో ప్రయాణం చేసే వారు విజయాన్ని చేరుకోలేరన్నారు. కార్యక్రమంలో హోప్ ఆసుపత్రి అధినేత, ఫాదర్ జాన్‌డేవిడ్, డాక్టర్ జ్యోతి, సంఘ ప్రతినిధులు సాంబశివరావు, నిరీక్షణరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పి.నైనవరం గ్రామంలో ఎన్‌ఐఏ తనిఖీలు

విజయవాడరూరల్: నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) అధికారులు సోమవారం తెల్లవారు జాము నుంచి విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గతంలో నక్సలైట్ల కార్యకలాపాలతో సంబంధాలు కలిగివున్న అమ్మిశెట్టి రంగా, అమ్మిశెట్టి రాధ భార్యభర్తలు జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రస్తుతం రంగా పాలకేంద్రాన్ని నిర్వహిస్తుండగా, రాధ చైతన్య మహిళా సంఘాన్ని నడుపుతున్నారు. అయితే నక్సలైట్లతో సంబంధాలున్నాయనే అనుమానంతో సోదాలు నిర్వహించి వెళ్లారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

పెనమలూరు: పెనమలూరు మండలం గంగూరు-1, తాడిగడప మున్సిపాలిటీ పోరంకి-1 సచివాలయాల పరిధిలో మంగళవారం జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అత్యవసర వైద్యం అవసరమున్న వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.